క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం



విద్యార్థులకు నగదు పురస్కారం అందజేసిన ప్రతినిధులు

ఉంగుటూరు : కాగుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు సోమవారం అందజేశారు. పెట్ల పార్వతి 18వ వర్ధంతి సందర్భంగా హెచ్ఎం వెలిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్వతి భర్త పెట్ల కామేశ్వర రావు నగదు పంపిణీ చేశారు. 1, 2 ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతిని అందించారు. కార్యక్రమానికి సర్పంచి సుదేష్ణ, మండల విద్యాశాఖ అధికారి సాయిబాబా పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి



తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

నిడమర్రు: పత్తేపురంలో నివాసస్థలాల భూములను నిషేధిత జాబితానుంచి తొలగించాలని పలువురు సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ దుర్గాప్రసాద్‌కు విన్నవించారు. సోమ వారం నిడమర్రులో నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక వద్ద అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ గవర సత్యనారాయణ మాట్లాడుతూ 1956 నుంచి చట్టపరంగా ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ కొనసాగుతున్నాయని పలు సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో ఉంచడంతో ఇంటి స్థలాలు బ్లాక్ లిస్ట్‌లో ఉన్నాయన్నారు. దీంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు తెలిపారు. సంఘ నాయకులు కోన శ్రీనివాసరావు, కానూరు రాజు, నంబూరు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ కుటుంబాన్ని ఆదుకుంటాం



పూర్ణిమారాణి కుటుంబాన్ని పరామర్శిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: గంగన్నగూడెం రేషన్ డీలర్ కుటుంబాన్ని ఆదుకుంటామని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం గంగన్నగూడెం రేషన్ డీలర్ పూర్ణిమా రాణి మృతి చెందారు. ఆమె భౌతికయాన్ని తహసీల్దార్ సుమతి, సీఎస్ డీటీ నాగరాజు, వీఆర్వో ప్రసాద్, దెందులూరు మండల రేషన్ డీలర్లు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాలాయగూడెం కో–ఆపరేటివ్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐకేపీ జిల్లా సభలకు తరలిరండి



ఏపీఎం రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

నిడమర్రు: ఐకేపీ యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి నిర్వహించే జిల్లా మహా సభలకు భారీగా మండలంలోని యానిమేటర్లు తరలి రావాలని ఆ సంఘ మండల కమిటీ అధ్యక్షుడు దేవుని విజయలక్ష్మి కోరారు. మంగళవారం ద్వారకాతిరుమలలో ఐకేపీ డ్వాక్రా యానిమేటర్ల సభకు హాజరవుతున్నట్లు సోమవారం వెలుగు ఏపీఎం రత్నకుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో దేవుని విజయలక్ష్మి మాట్లాడుతూ కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. కనీస వేతనం అమలు, ఆన్‌లైన్ భారం తగ్గించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ ఆ సభల్లో ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి భవాని, అచ్చయమ్మ, కె.స్వరూప పాల్గొన్నారు.

29 నుంచి పాండురంగ స్వామి ఉత్సవాలు

ఉంగుటూరు: చేబ్రోలు పాండురంగస్వామి ఆలయంలో ఈ నెల 29 నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు చేయడానికి నిర్ణయించారు. 29న వాసుదేవ అఖండ నామం నిర్వహిస్తారు. 30న గోపూజ, తులసీపూజ, భజన నిర్వహిస్తారు. 31న రుక్మిణీ సమేత శ్రీపాండు రంగ స్వామి కల్యాణం నిర్వహిస్తారు. నవంబరు 1న 108 కలశాలతో స్వామి వారికి జలాభిషేకాలు, అగ్నిగుండ మహోత్సవం, 2వ తేదీన పూర్ణాహుతి, అన్నసమారాధన చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు.

నిరీక్షణ.. ప్రదక్షిణ!

- నూతన పింఛన్ల కోసం అర్హుల ఎదురుచూపులు
- 15 నెలలుగా ఓపెన్ అవ్వని ఆన్‌లైన్ సైట్
- సచివాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

దెందులూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వితంతు, వృద్ధాప్య పింఛన్ల కోసం నూతనంగా దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ ఇంకా సైట్ ఓపెన్ అవ్వలేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరిగుతున్నారు. గ్రామాల్లో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే పింఛన్లే ప్రధాన ఆధారం. గత ప్రభుత్వం ప్రతి నెలా రూ.3 వేల పింఛన్‌ను అందజేసేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛన్ నగదును రూ.4 వేలకు పెంచింది. కానీ అదనంగా నూతన పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే లబ్ధిదారులను ఎంపిక చేసి కొత్తగా అర్హులైన వారికి పింఛన్లు అందజేసేవారు. మొదటి మూడు సంవత్సరాల పాటు ప్రతి మూడు నెలలకో సారి చొప్పున నూతన పింఛన్లు అందజేసేది. ఆ తరువాత 2023, 2024 సంవత్సరాల్లో ప్రతి ఆరు నెలలకు అర్హులైన వారు నష్టపోకుండా వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి పింఛన్లు అందజేసింది. 2024 జనవరిలో వైఎస్సార్ సీపీ హయాంలో చివరిగా నూతన పింఛన్లు అందజేశారు. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో నూతన పింఛన్లకు బ్రేక్ పడింది. ఆ విధంగా 2024 ఏప్రిల్‌లో ఆగిపోయిన సైట్ నేటికీ ప్రారంభం కాలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబర్‌లో కొత్త జీవో తీసుకొచ్చింది. పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే, మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏడాదిగా నూతన పింఛన్లు రాకపోవడంతో దెందులూరు మండలంలో 60 సంవత్సరాలు నిండిన సుమారు 1500 మందికి పైగా లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి జన్మభూమి కార్యక్రమం నిర్వహించి నూతన పింఛన్లు అందజేస్తామని గత డిసెంబర్‌లో ప్రజా ప్రతినిధులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి నూతన పింఛన్లు అందుతాయని ఎదురు చూసిన లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి.



దెందులూరు సచివాలయం

50 ఏళ్ల హామీ అమలు ఎప్పుడో?

ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే వెనుబడిన తరగతులకు చెందిన వారికి 50 సంవత్సరాలు పూర్తయిన వెంటనే పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. దీంతో మండలంలో సుమారు 6 వేల మందికి పైగా 50 సంవత్సరాలు నిండిన వారు ప్రభుత్వ హామీ ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

అర్హులకు అందజేయాలి



అర్హులందరికీ ప్రభుత్వం నూతన పింఛన్లు అందజేయాలి. వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం అందజేసే పింఛనే ఆధారం.కనీసం ఆరునెలలకు ఒక్కసారైనా నూతన పింఛన్లు అందజేయాలి.అర్హులైన లబ్ధిదారులను గుర్తించితక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ముంగర సంజీవ్‌కుమార్, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్

దరఖాస్తులు స్వీకరించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా నేటికీ నూతన పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరించకపోవడం దారుణం అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 50 ఏళ్లకు పింఛన్ అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది.

– అప్పన ప్రసాద్, దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్

50 ఏళ్లకు పింఛన్ అందజేయాలి



కూటమి ప్రభుత్వంలోచేతి వృత్తుల వారికి ఎటువంటి పథకాలు అందడం లేదు. ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా వెనుకబడిన తరగతుల వారికి 50 ఏళ్లకు పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు చెందిన 50 ఏళ్ల నిండిన వారికి వెంటనే పింఛన్లు అందజేయాలి.

– నిట్టా లీలా నవకాంతం, దెందులూరు జెడ్పీటీసీ

ఆదేశాలు వస్తే అందజేస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం పింఛను అందుకుంటున్న భర్త చనిపోయిన భార్యలకు నూతన పింఛన్లు అందజేస్తున్నారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పింఛన్లు అందజేస్తాం.

– రాధాకృష్ణ, పింఛన్ల ఇన్‌చార్జి, ఎంపీడీఓ కార్యాలయం, దెందులూరు

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



శివలింగం గల రథంపై ఊరేగిన అమ్మవారు



ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు

భీమడోలు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సోమవారం అమ్మవార్ల గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కురెళ్లగూడెంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకనకదుర్గదేవి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శివలింగం కలిగిన రథంపై సుందరంగా ముస్తాబు చేసిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. రథాన్ని మహిళలు తమ చీరలపై నడిపించారు. అమ్మవారి ఊరేగింపు మేళ తాళాలు, శక్తి వేషాల మధ్య గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి నిమజ్జనోత్సవం చేశారు.

అవగాహనతోనే ఉత్తమ జీవనం

దెందులూరు: అవగాహనతోనే ఉత్తమ జీవన విధానం సాధ్యమని పెదవేగి సీఐ రాజశేఖర్ అన్నారు. సోమవారం రాత్రి శ్రీశైనికుల పేట కమ్యూనిటీ హాల్‌లో చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలన్నారు. నేరాలు, శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీసులకు విధి నిర్వహణలో ప్రజలు స్నేహపూరిత సహాయ సహకారాలు అందించాలన్నారు. దెందులూరు ఏఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ హమీద్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించి ధృవ పత్రాలు బండిలో ఉంచుకోవాలని పెదవేగి సీఐ రాజశేఖర్ అన్నారు. సోమవారం రాత్రి దెందులూరు ఎన్టీఆర్ సర్కిల్‌లో వాహనాల ధృవపత్రాలు హెల్మెట్ తనిఖీ నిర్వహించారు. ధృవ పత్రాలు హెల్మెట్లు లేని వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ధృవ పత్రాలు ఉంచుకొని హెల్మెట్ పెట్టుకుని భద్రంగా గమ్యస్థానానికి చేరాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు లోను కావద్దని సీఐ రాజశేఖర్ అన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పెదవేగి సీఐ రాజశేఖర్

పంటలకు మద్దతు ధర కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెంలోని యూటీఎఫ్ కార్యాలయం హాలులో ఏపీ రైతు సంఘం మండల మహాసభ ఆ సంఘం మండల అధ్యక్షుడు బోడిక రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహా సభలో రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ పసల సూర్యారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయి వరకు రైతు సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కొయ్యలగూడెం: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బల్లే చిన్నబాబు విద్యార్థులకు పది రకాలైన మానసిక ఆరోగ్య సూచనలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సరిపడా విశ్రాంతి, నెలకోసారి విహారానికి వెళ్లడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఎనిమిది గంటల నిద్ర, కృతజ్ఞత, సెలవు రోజుల్లో కాలానుగుణంగా మనం చేసే నిత్య కృత్యాలు, మత్తు పదార్థాలను వదిలి వేయడం, ఇతరులకు సహాయం చేయడం వంటివి అలవర్చుకున్నట్లయితే మన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. విద్యార్థులచే బ్రీతింగ్ ఎక్సర్ సైజులు చేయించారు. విద్యార్థులకు, టీచర్లకు మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించినందుకు ప్రధానోపాధ్యాయిని నిమ్మలూరి ఉమాదేవి కౌన్సిలర్‌ను అభినందించారు.

మానసిక ఆరోగ్యంతోనే నాణ్యమైన విద్య

కామవరపుకోట: మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే నాణ్యమైన విద్య సాధ్యపడుతుందని జిల్లా మానసిక కౌన్సిలర్ మానుకొండ సుధీర్‌కుమార్ తెలిపారు. వరల్డ్ మెంటల్ హెల్త్ వీక్‌లో భాగంగా సోమవారం ఈస్ట్ యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుధీర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాలలో కొత్త విషయాలు నేర్చుకోవాలని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, ఎమోషన్‌ను అదుపులో ఉంచుకుంటూ సత్ప్రవర్తన అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.



అవగాహన కల్పిస్తున్న రిసోర్సు పర్సన్

విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన

గణపవరం: వస్తుసేవల పన్ను జీఎస్టీ సంస్కరణలు అన్ని వర్గాల ప్రజలతో పాటు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని జీఎస్టీ 2.0పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఉపాధ్యాయులు సూచించారు. సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లోని 203 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, హైస్కూలు ప్లస్‌లతో పాటు ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దీనిపై ఈ నెల 7వ తేదీన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించనున్నారు.

గ్రామాభివృద్ధికి దాతల చేయూత అభినందనీయం

దెందులూరు: గ్రామాభివృద్ధికి దాతల చేయూత అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పోతునూరు గ్రామంలో సోమవారం కొమ్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పీపీ వీరమాచినేని ప్రభాకర్ అధ్యక్షతన దాత కొమ్మారెడ్డి రాంబాబు రూ.30 లక్షలతో నిర్మించిన వైద్యశాల భవనం, రూ.2 లక్షలతో నిర్మించిన తాగునీటి ప్లాంట్, రూ.10 లక్షలతో నిర్మించిన విద్యార్థుల సైకిల్ షెడ్డును స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, దాత కొమ్మారెడ్డి రాంబాబు ఆయన కుమారుడు కొమ్మారెడ్డి సదాశివ రావు సిద్ధు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సోమవారం ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో భీమరాజు, నాయకులు, ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ

ఉంగుటూరు: ఈ నెల 7, 8 తేదీల్లో సర్పంచులకు, ఎంపీపీలకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉందని ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. రెండు రోజులు శిక్షణకు సర్పంచులు అందరూ హాజరు కావాలని సూచించారు.

వైభవంగా గాయత్రి హోమం

కొయ్యలగూడెం: శ్రీగాయత్రీ మాత హోమం సోమవారం ఘనంగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో అర్చకులు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ శ్రీనివాసుల పార్థసారథి భక్త దంపతులతో హోమ క్రతువు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమంలో విశేష ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి సమర్పించారు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీగాయత్రి లక్ష కుంకుమార్చనను పదిహేను రోజుల పాటు నిర్వహించామని శేషాచార్యులు తెలిపారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తురాలు సోమవారం రూ.1,10,116 విరాళంగా అందజేశారు. రాజమండ్రికి చెందిన జె.శేషులత ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండ్‌ను అందజేశారు.

ఘనంగా అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు నిర్వహిస్తున్న అన్నసమారాదన కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాలధారణ స్వాములు భిక్షను స్వీకరించారు. ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపాటి సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

పెదవేగి: మండలంలోని రాయన్నపాలెంలో సోమవారం గంగానమ్మ, పోతురాజు, నాగేంద్ర స్వాముల విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అమ్మవార్లకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు జేఏసీ నాయకుల ర్యాలీ

జంగారెడ్డిగూడెం: పాలస్తీనాలోని గాజా ప్రజలకు మద్దతుగా ఈ నెల 7వ తేదీ సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తామని, ఈ ర్యాలీకి అన్ని పార్టీలు, ముస్లిం సోదరులు హాజరు కావాలని జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ పిలుపునిచ్చింది. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి 7వ తేదీకి రెండు సంవత్సరాలు కావస్తోందని, 70 వేలకు పైగా ప్రజలు మృత్యువాతకు గురయ్యారన్నారు. గాజా ప్రజలకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ షేక్ ముస్తఫా, షేక్ బాజీ (టిప్ టాప్), షేక్ యాకూబ్, షేక్ ఆదిల్, షేక్ అక్బర్, షేక్ నజీర్, అబ్దుల్ షాహి, షేక్ ముస్తాక్, సయ్యద్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

లింగపాలెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ ఏలూరు ఇండోర్ స్టేడియంలో హ్యాండ్ బాల్ సెలక్షన్స్ అండర్–14 క్రీడా విభాగంలో లింగపాలెం మండలం కలరాయనగూడెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కలరాయనగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న మాణికల అఖిల్‌కుమార్, చెరుకు విక్రమ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.పద్మావతి, ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి కె.రామారావు, జె.రవీంద్ర, సర్పంచ్ సీహెచ్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయురాలు

ఎర్ర కాలువ ప్రక్షాళన ఎప్పుడో?

- ముళ్ల పొదలతో పూడిపోతున్న కాలువ
- సాగునీరందక రైతుల ఇక్కట్లు
- అభివృద్ధి చర్యలు చేపట్టాలని కోరుతున్న రైతులు

చింతలపూడి: ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో ఎర్ర కాలువకు ఆధారమైన మేడవరపు చెరువు నీటితో కళకళలాడుతోంది. కాని ముళ్ల పొదలు మొలిచిపోవడంతో కాలువ పూడుకుపోయింది. దీంతో ప్రక్షాళన చేపట్టాలని రైతులు కోరుతున్నారు. చింతలపూడి మండలం శెట్టివారిగూడెం వద్ద మేడవరపు చెరువు అలుగు నీరు ప్రవహించేదే ఎర్రకాలువ. ఇక్కడి నుంచి సుమారు 21 కిలో మీటర్లు ప్రవహించి ఎర్రకాలువ ప్రాజెక్టులో కలుస్తుంది. మేడవరపు చెరువు కింద సుమారు 2,000 ఎకరాలకు సాగు నీరు అందిస్తున్న ఈ కాలువ పొడవునా వేలాది ఎకరాలు పండుతుంది. ఒకప్పుడు ఎర్రకాలువ అంటే పొలాలను ముంపుకు గురి చేసే మహమ్మారి అని రైతులు భయపడేవారు. 1998లో అప్పటి రాష్ట్ర మంత్రి కోటగిరి విద్యాధరరావు సుమారు రూ.4.11 కోట్ల నిధులు మంజూరు చేయించి కాలువను 17.5 కిలో మీటర్లు అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రైతులకు ముంపు బాధ తప్పింది. రాను, రాను మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎర్రకాలువ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మేడ వరపు చెరువును అభివృద్ధి చేసి మినీ ప్రాజెక్టుగా మార్చాలని ఇక్కడి రైతాంగం ఎప్పటి నుంచో కోరు తోంది. వరదల సమయంలో ఎర్రకాలువ నీరు కిందకి ప్రవహించి ఇక్కడి రైతాంగానికి ఉపయోగపడటం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం చెక్ డ్యామ్‌లు కట్టినా భూగర్భ జలాలు పెరిగి మెట్ట ప్రాంతానికి కొంత వరకు ఉపయోగం ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం చెరువు ఆక్రమణలకు గురై కుంచించుకు పోయింది. దీంతో చెరువులోకి వచ్చే వర్షపు నీరు అలుగు ద్వార బయటికి వృధాగా పోతుంది. ఆక్రమణలు తొలగించి చెరువును అభివృద్ధి చేసినట్లయితే రైతులకు మరింత మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రేచర్ల సమీపంలో ఎర్ర కాలువ గట్లపై పెరిగిన ముళ్ల పొదలు

ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు



300 ఏళ్ల క్రితం ఏర్పడిన ఎర్రకాలువ అభివృద్ధి పట్ల ప్రజా ప్రతినిధులు అస్సలు పట్టించుకోవడం లేదు. దీంతో ఎర్ర కాలువ నీరు పంటలకు ఉపయోగ పడకుండా వృధాగా పోతుంది. మేడవరపు చెరువు పూడికను తొలగించి అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం ఎర్రకాల్వ నీరు క్రిందికి పోకుండ ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మించాలి. కాలువ నీరు రైతులకు ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలి.

– చేపూరి ఖాదర్ బాబు, మాజీ జెడ్పీటీసీ